క్లుప్తంగా

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

షాద్‌నగర్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని గురువారం షాద్‌నగర్ పట్టణంలో న్యూ పవర్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ విద్యార్థులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మాస్టర్లు బాల్‌రాజ్, అహ్మద్‌ఖాన్‌లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు, యుద్ధ విద్యల్లో రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహ



ప్రధాని కార్యక్రమాన్ని టీవీలో వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

కేశంపేట: కేంద్ర ప్రభుత్వం రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహ యాదవ్ అన్నారు. గురువారం ప్రధాని మోదీ రాజస్తాన్ రాష్ట్రంలోని సికిర్ నుంచి కిసాన్ సమృద్ధి కేంద్రాలను జాతికి అంకితం చేసే కార్యక్రమాన్ని మండల బీజేపీ నేతలు టీవీల ద్వారా వీక్షించారు. అనంతరం నర్సింహ యాదవ్ మాట్లాడుతూ కేంద్రం రైతులకు మద్దతు ధరలను పెంచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, సాయిప్రసాద్, ఆనంద్, రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు చారి, శ్రీను, రమేశ్, మల్లేశ్, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య, శ్రీరామ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

కొందుర్గు: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన 40 మంది బీఆర్‌ఎస్ నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారని ఆ పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి తెలిపారు. షాద్‌నగర్‌లో పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ వారిని పార్టీలోకి ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మల్లయ్య, మధు, పెంటయ్య, నరేందర్ తదితరులు ఉన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి



నియామక పత్రాలు అందిస్తున్న రవికుమార్

కొందుర్గు: మహేశ్వరం పట్టణంలో ఆగస్టు 2న నిర్వహించే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ షాద్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి రవికుమార్ పిలుపునిచ్చారు. గురువారం కొందుర్గులో విశ్వరూప మహసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ హాజరవుతారని, అన్ని గ్రామాల ప్రజలు హాజరై.. విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడుగా వినోద్, ఉపాధ్యక్షుడుగా శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. వారికి నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్, సాయి, మహేందర్, అనంతయ్య, యాదగిరి, రాజు, నరేందర్, యాదయ్య పాల్గొన్నారు.

తెరిపీయని వర్షం

కొందుర్గు: పదిహేను రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో ప్రధానంగా వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగిస్తారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలను సాగుచేస్తారు. ఈ పంటలకు వారానికో, పదిరోజులకో ఒక తడి నీరు అందిస్తే సరిపోతుంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో వరద నీరు నిలిచి పంటలు దెబ్బతింటున్నాయి. పంటల సాగుకోసం రైతులు లక్షల్లో ఖర్చు చేశారు. వర్షం వల్ల పూర్తిగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.



శంకర్‌పల్లి: పరవళ్లు తొక్కుతున్న మూసీ వాగు



కొందుర్గు: ముట్పూర్‌లో దెబ్బతిన్న మిర్చిపంట

అంతా అస్తవ్యస్తం!

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా తెరిపివ్వకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. మూసీ, ఈసీ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎడతెరిపిలేని వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. కూలీలకు కూలీ కరువైంది. పంటపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పొలాలు నీటమునిగి రైతులకు నష్టం వాటిల్లింది. వర్షాలకు ఇళ్లు కూలిపోతున్నాయి. గ్రామాల రోడ్లతో పాటు జాతీయ రహదారులు జలమయంతో ప్రమాదకరంగా మారాయి. పది రోజులగా కురుస్తున్న వర్షాలకు సతమతమవుతుంటే.. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



మొయినాబాద్ రూరల్: ఈసీ వాగును తిలకిస్తున్న జనం



చేవెళ్ల: తంగడపల్లిలో కూలిన ఇల్లును పరిశీలిస్తున్న అధికారులు



హిమాయత్‌నగర్ చౌరస్తాలో..

మాజీ ఎమ్మెల్యేకు నివాళి

కొందుర్గు: కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో గురువారం మాజీ ఎమ్మెల్యే కృష్ణకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం నాయకులు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ కురుమలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లప్ప, శేఖర్, మల్లేశ్, శివ పాల్గొన్నారు.

బీసీబంధు ఇవ్వాలి

షాబాద్: బీసీబంధు ద్వారా బీసీలకు రూ. 10 లక్షలు ఇవ్వాలని బీఎస్‌పీ చేవెళ్ల డివిజన్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు శ్రీశైలం డిమాండ్ చేశారు. గురువారం షాబాద్ ఎంపీడీఓ అనురాధకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీనివాస్, రఘు, రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణగౌడ్‌కు ఉత్తమ సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న రామకృష్ణగౌడ్

మొయినాబాద్: మండలంలోని పెద్దమంగళారం మాజీ సర్పంచ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు చేగూరి రామకృష్ణగౌడ్‌కు ఉత్తమ సేవా అవార్డు వరించింది. సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టేవారిని గుర్తించి హోప్ టిలోజికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని చిక్కడుపల్లిలో ఉన్న త్యాగరాయగాన సభలో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందజేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ జయలక్ష్మి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి

కేశంపేట: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి ఆరోగ్యంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఎ డాక్టర్ జయలక్ష్మి ఆకాంక్షించారు. మండలంలోని పాటిగడ్డ గ్రామంలో ఉన్న కాస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గురువారం వైద్యశాఖ ఆధ్వర్యంలో హెల్త్ ఎడ్యుకేషన్ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినీలు శుభ్రంగా ఉండాలన్నారు. భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుకోవాలన్నారు. వానాకాలంలో ఆహారపదార్థాలను, మంచి నీళ్ల కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో 101 మంది విద్యార్థులకు పరీక్షలను నిర్వహించి వారికి అవసరమైన మందులను అందించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత, అంజనేయులు, శ్రీనివాసులు, అరుణ, సుందరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీలను బొంద పెట్టాలి



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్

షాద్‌నగర్ రూరల్: రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలను బొందపెట్టి.. కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలంలోని బూర్గుల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్, ఎస్సీసెల్ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని ఆరోపించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ సంపదను కొల్లగొడుతుంటే, ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ఖజానాను దోచుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందని తెలిపారు.

గ్రామ కమిటీ ఇదే..

బీసీసెల్ కమిటీ అధ్యక్షుడిగా వెంకటేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సురేష్, ఉపాధ్యక్షులుగా కృష్ణయ్య, శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణయ్య, కార్యదర్శులుగా చాకలిచెన్నయ్య, కృష్ణయ్య, కోశాధికారిగా వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. అలాగే ఎస్సీసెల్ కమిటీ అధ్యక్షుడిగా జగన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కార్యదర్శిగా ప్రశాంత్, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీసర్పంచ్ పరశురాం, నాయకులు బసప్ప, రాజు, శివ, రాంచంద్రయ్య, ఆంజనేయులు, రాజుగౌడ్, చాకలిశ్రీను, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

రోజంతా ముసురు

- మండలంలో 2 సెం.మీ వర్షపాతం నమోదు
- పంట పొలాల్లోకి నీళ్లు
- పొంగి పొర్లుతున్న వాగులు

చేవెళ్ల: వరుణదేవుడు శాంతించటం లేదు. దీంతో మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తునే ఉన్నాయి. చేవెళ్ల మండలంలో గురువారం ఉదయం నుంచి వర్షం ముసురు పడుతూనే ఉంది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఓ మోస్తారు వర్షం కురిసింది. చేవెళ్ల మండలంలో దాదాపు 2 సెం.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలుస్తోంది. దీంతో ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో పాటు మండలంలో కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలకు వాగులు వంకలు నిండి పొంగిపొర్లుతున్నాయి. తంగడపల్లి వద్ద మూసీ వాగు, దేవరాపంల్లిలోని ఈసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అలాగే మండలంలోని ఆలూరు, పామెన, దామరగిద్ద, దేవుని ఎర్రవల్లి, ఇబ్రహీంపల్లి, తలారం, కౌకుంట్ల తదితర గ్రామాల్లోని వాగులు నిండుకుండలా ఉన్నాయి. పొలాల్లో వర్షం నీరు నిలిచి చెరువులను తలపిన్నాయి. వర్షాలతో పంటలు నష్టపోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

షాబాద్ మండలంలో...

షాబాద్ మండలంలో ఉన్న చెరువులు జోరుగా కురుస్తున్న వర్షాలకు అలుగుపారుతున్నాయి. షాబాద్ మండలంలో 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేని జోరువానలతో మండలంలోని చందనవెల్లి, పహిల్వాన్ చెరువులు నిండుగా మారాయి. చందనవెల్లిలోని పెద్ద చెరువు ఆలుగు పారుతుంది. చెరువులు నిండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కుంటలను తలపిస్తున్న పొలాలు

ఆపదలో అండగా..

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లిశంకర్



వెలిజర్లలో ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న వీర్లపల్లిశంకర్ తదితరులు

షాద్‌నగర్ రూరల్: వర్షాలకు నిరాశ్రయులైన వారికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్ల, దేవుని బండతాండ, మొగిలిగిద్ద, కందివనం గ్రామ పంచాయితీల్లో ఆయన పర్యటించారు. వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధితులు గోడును వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులకు ఆయన నిత్యవసర వస్తువులతో పాటు ఆర్థిక సాయం అందజేశారు. వెలిజర్ల గ్రామంలో మంగలి గౌతమికి రూ. 25వేలు, చాకలి పావనికి రూ. 10వేలు, దేవుని బండ తాండలో పెంటమ్మకు రూ. 25వేల నగదు అందజేశారు. అలాగే కందివనం గ్రామంలో వడ్డె బాలకృష్ణకు, మొగిలిగిద్దలో గూడెపు యాదయ్యకు చెరో రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు కూలిపోవడంతో నిరాశ్రయులవుతున్నారని పేర్కొన్నారు. అందుకే ఇంటి మరమ్మతుల కోసం తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశామని తెలిపారు. ఇళ్లు కూలిపోయిన పేదలకు ప్రభుత్వం పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెలిజర్ల సర్పంచ్ అమృతమ్మ నర్సింహ్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లాశ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ముద్దు...



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు, యువకులు

శంకర్‌పల్లి: మోకిల గ్రామాన్ని మున్సిపాలిటీ ఏర్పాటు చేయవద్దని మోకిల గ్రామస్తులు గురువారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపాలిటీ వద్దు... గ్రామ పంచాయతీ ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మోకిల గ్రామ పంచాయతీ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ఉందని తెలిపారు. తమ గ్రామాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీగానే ఉంచాలి....

శంకర్‌పల్లి: మోకిలను గ్రామ పంచాయతీగానే ఉంచాలని ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌండ్ర సత్యం డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ నాయకులు వారి రాజకీయ స్వార్థం కోసం మోకిలను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని అంటున్నారని విమర్శించారు. పంచాయతీగా ఉంటేనే ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కారమవుతాయని తెలిపారు. మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తే ప్రజలపై పన్ను భారంతో పాటు అనేక సమస్యలు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధం

ఆర్‌డీఓ వెంకటమాధవరావు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్‌డీఓ

షాద్‌నగర్: విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని ఆర్‌డీఓ వెంకట మాధవరావు తెలిపారు. గురువారం షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో వర్షాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా మరో మూడు రోజుల పాటు భారీగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఫరూఖ్‌నగర్ మండలంలోని నాగులపల్లి, అయ్యవారిపల్లి గ్రామ శివారులోని వాగుల్లో భారీగా వరద ప్రవహిస్తోందని, చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాధితులకు పునరావాసం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకన్న, పట్టణ సీఐ ప్రతాప్ లింగం, తహసీల్దార్ గోపాల్ తదితరులున్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



షాబాద్: పోస్టు కార్డులతో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

షాబాద్: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య డిమాండ్ చేశారు. గురువారం షాబాద్ మండలంలో పోస్టు ఆఫీసు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ సాధనలో జర్నలిస్టులు ఎంతో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. జర్నలిస్టుల విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిన్న చూపు చూస్తున్నారని విమర్శించారు. జర్నలిస్టులకు ఇవ్వాల్సిన ఇళ్ల స్థలాలు కేటాయించడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో రమేశ్, రవీందర్, మల్లికార్జున్, శ్రీనివాస్, రాములు, వెంకటేష్, నర్సింహులు, నరేందర్, రాఘవేందర్, రమేష్‌గౌడ్, మధుసుధన్, రవి, శివరాజ్, అకిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌లు ఏర్పాటు చేయాలి

షాద్‌నగర్: నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో ప్రెస్‌క్లబ్‌లను ఏర్పాటు చేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ప్రింట్ మీడియా షాద్‌నగర్ అధ్యక్షుడు శ్రీశైలం డిమాండ్ చేశారు. గురువారం ఆయన షాద్‌నగర్‌లో మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు ఎమ్మెల్యే సుముఖతను వ్యక్తం చేశారని, త్వరలోనే తీపి కబురు వస్తుందని అన్నారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్ యాదవ్, ప్రింట్ మీడియా జిల్లా నాయకుడు భాస్కర్, సీనియర్ పాత్రికేయులు శ్రీనివాస్, శరత్ కుమార్, సుధాకర్, రమేష్, రాజశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

కేశంపేట: భారీగా కురుస్తున్న వర్షాల పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ బీఎస్ఎస్ వరప్రసాద్ హెచ్చరించారు. వర్షాల నేపథ్యంలో మండలంలోని వాగులను ఆయన గురువారం పరిశీలించారు. మండలంలోని పాటిగడ్డ గ్రామ శివారులో వాగు పొటెత్తడంతో వాగుకు అడ్డంగా కంపను వేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు అత్యవసరమైతేనే బయటికి రావాలని సూచించారు. మండలంలో అవాంఛనీయ ఘటనలు జరిగే వెంటనే సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

కొత్తూరు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, కాల్వల్లో నీటి ప్రవాహం పెరిగిందని ప్రజలు, రైతులు జాగ్రత్తగా ఉండాలని కొత్తూరు సీఐ శంకర్‌రెడ్డి సూచించారు. ఆయన గురువారం మండలంలోని మక్తగూడతో పాటు పలు గ్రామాల్లో పర్యటించారు. మక్తగూడ శివారులో నందులకత్వా వాగులో నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో రోడ్డును బారికేడ్లతో మూసివేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శరత్ చంద్రబాబు, తహసీల్దార్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ వాగు

మొయినాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో ఈసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. బుధవారం రాత్రి నుంచి గురువారం రోజంతా వర్షం కురువడంతో ఈసీ వాగులోకి భారీగా వరద వచ్చింది. ఎగువ ప్రాంతాలైన మొయినాబాద్, చేవెళ్ల, షాబాద్, కొందుర్గు మండలాలతో పాటు వికారాబాద్ జిల్లా పూడూర్ మండలంలో భారీగా వర్షం పడింది. దీంతో గురువారం ఉదయం నుంచి ఈసీ వాగులో వరద వచ్చింది. మధ్యాహ్నానికి వరద ఉధృతి బాగా పెరిగింది. మండలంలోని వెంకటాపూర్, అమ్డాపూర్, కాశీంబౌలి, బాకారం, నాగిరెడ్డిగూడ గ్రామాల సమీపంలో ఈసీ వాగు ఉప్పొంగి పంట పొలాలు నీటమునిగాయి.

ఉధృతంగా మూసీ

శంకర్‌పల్లి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి గురువారం మూసీ వాగుకు వరద తీవ్రత పెరిగింది. వారం రోజులుగా మూసీ వాగు ఉధృతంగా ప్రవహించగా.. బుధవారం కొద్దిగా తగ్గుముఖం పట్టింది. గురువారం ఉదయం నుంచి వరద తీవ్రత ఎక్కువ అయింది.

మండలంలో 35 మీ.మీ. వర్షపాతం

కేశంపేట: మండలంలో గురువారం వరకు 35.3మీ.మీ. వర్షపాతం నమోదైందని ఎంపీఎస్ఓ కల్యాణి తెలిపారు. సంగెం రెంజ్‌లో 28 మీ.మీలు, కేశంపేటలో 38.3 మీమీలు నమోచెప్పారు.